అవినీతికి తావుండదు : ఎస్ఇ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వ్యవసాయానికి అందజేసే విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటులో ఎలాంటి అవినీతి, అవకతవకలకు చోటివ్వకూడదని తిరుపతి జిల్లా ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రబాబు నాయుడు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బుధవారం 'ప్రజాశక్తి'లో ట్రాన్స్'ఫార్మర్ల'కష్టాలు అన్న శీర్షిక కథనం వెలువడింది. స్పందించిన ఎస్ఈ సురేంద్రబాబు నాయుడు పెండింగ్ లో ఉన్న కొత్త వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు సకాలంలో అందజేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మరమ్మత్తులకు గురైన ట్రాన్స్ ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు పూర్తిచేసి రైతులకు అందజేయాలనీ, లేకుంటే పాడైన వాటి స్థానంలో కొత్తవి ఇవ్వాలని ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్లు, మెటీరియల్ తరలింపులో రైతుల నుంచి ఎలాంటి అదనపు వసూళ్లకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. తొట్టంబేడు మండలంలోని రాంభట్లపల్లిలో పెట్టిన ఐదు నిమిషాలకే కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో బుధవారం మరొకటి అధికారులు ఏర్పాటు చేశారు.

కూల్చింది.. కారకులు.. ఎవరు..?

బాధితులకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు అఖిలపక్షం నేతల వినతి

• వేణుగోపాలకాలనీ నిరాశ్రయుల వ్యథ • కోట్లల్లో నష్టపోయామంటున్న బాధితులు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'సోమవారం అర్ధరాత్రి నుంచి వారికి కంటిమీద కునుకు లేదు... పైసా పైసా పోగేసి ప్లాటు కొనుక్కుని, సొంతింటి కల నెరవేర్చుకునేలా ఇళ్లు కట్టుకున్న వారి కళ్లెదుటే కాలనీని జేసీబీలతో నేలకూల్చేయడం వారిని బాధిస్తోంది.. కోర్టు కేసు దాచిపెట్టి తమకు ప్లాట్లు అమ్మిన వారిని అనాలా.. ఉన్నపళంగా రాత్రికి రాత్రే జేసీబీలతో వచ్చి నిర్బంధంగా ఇళ్లను కూల్చేసిన వారిని అనాలా అనేది వారికి అంతుచిక్కడం లేదు. ఎవరో చేసిన అక్రమాలకు తాము బలైపోయామంటూ గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న వారి వేదన అధికార పార్టీకి మాత్రం కనిపించడం లేదు. బుధవారం వారిని పరామర్శించేందుకు వచ్చిన అఖిలపక్షం నేతలకు తమ గోడు వినిపించారు. అనంతరం అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.. సిపిఎం బాధితులకు అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు బాధితులకు భరోసా ఇచ్చారు.

బాధితుల గోడు ఇలా...

వారు కొన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈసీలు వచ్చాయి. పంచాయతీల్లో పన్నులు ఇచ్చారు. విద్యుత్ మీటర్ బిగించారు. కళ్లెదుటే తమ ఆశల సౌధాన్ని కూల్చేయడంతో తిండి నిద్ర మాని తమను ఎవరు కాపాడతారా? అని కూలిన ఇళ్ల మధ్యనే గుండెలవిసేలా రోదిస్తూ లబోదిబోమంటున్నారు. రాత్రికి రాత్రే వేణుగోపాల్ కాలనీ రూపురేఖలు మారిపోయాయని, ప్రభుత్వం తమను ఆదుకుని, పునరావాసం కల్పించి, ఇళ్లు కట్టి ఇవ్వాలని వారు వేడుకొంటున్నారు. ఘటనా స్థలానికి బుధవారం వచ్చిన తిరుచానూరు సిఐని ప్రాధేయపడుతూ కన్నీరుమున్నీరయ్యారు. సిఐ స్పందిస్తూ కేసు దర్యాప్తు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇద్దరి మధ్య ఉన్న స్థల వివాదం వందలాదిమందిని నిరాశ్రయులను చేసింది.

కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి : అఖిలపక్షం

వేణుగోపాల్ కాలనీ వాసులపై దౌర్జన్యం చేసి, ఇళ్లు కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కూల్చిన స్థలాల్లోనే ఇళ్లను నిర్మించి, పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. టిడిపి మహానాడులో వేణుగోపాల్ కాలనీవాసుల సమస్యపై తీర్మానం చేయాలని డిమాండ్‌చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అద్యక్షులు పి.అంజయ్య, సిపిఎం నాయకులు కె.వేణుగోపాల్, జి.బాలసుబ్రమణ్యం, పి.బుజ్జి, బి.మునిరాజా, సిపిఐ నాయకులు జె.విశ్వనాథం ఉన్నారు.

ఆర్డీవోను పంపిస్తామని కలెక్టర్ హామీ

అఖిలపక్షం నేతలు వినిపించిన సమస్యను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆర్డీవోను ఘటనా స్థలానికి గురువారం పంపిస్తానని చెప్పారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాలని ఆర్డీవోను ఆదేశించారు.

నియోజకవర్గ ఎంఎల్ఎ స్పందించాలి

రూపేష్‌కుమార్, చిత్తూరు

ఏడేళ్ల మునుపు వేణుగోపాల్ కాలనీలో 35 లక్షలు వెచ్చించి ప్లాట్లను కొనుగోలు చేశాం. రక్షణ కోసం ప్రహరీ గోడ నిర్మించి, సౌకర్యాలకు మరో రెండు లక్షలు అదనంగా ఖర్చు చేశాను. ఏడేళ్లుగా మా స్వాధీన అనుభవంలోనే ఈ ప్లాట్లు ఉన్నాయి. ఇపుడు రాత్రికి రాత్రి వచ్చి మేం నిర్మించుకున్న ఇళ్లను కూల్చేసి తమది అంటున్నారు. మాకు అమ్మింది రుద్రగోపి, శ్రీనివాసులురెడ్డి. మా దగ్గర మా స్థలాలకు సంబంధించిన అన్ని లింకు డాక్యుమెంట్లు ఉన్నాయి. చంద్రగిరి ఎంఎల్ఎ స్పందించి న్యాయం చేయాలి.

భయభ్రాంతులకు గురిచేశారు

మునస్వామి, జీవకోన

మూడేళ్లకు ముందు వేణుగోపాల్ కాలనీలో కామరాజు పళనిస్వామి నుంచి ఓ ఇంటిని కొన్నాను. అప్పటినుంచి ఇంటిని బాగా నిర్మించుకోడానికి అప్పులు చేసి కట్టుకున్నాను. నా ఇంటికి సంబంధించి పట్టా మంజూరుకు డబ్బులు కూడా అడిగి తీసుకున్నారు. సోమవారం రాత్రి 300 మంది యువకులు వచ్చి ఒక్కసారిగా కాలనీలోకి చొరబడి జేసీబీ యంత్రాలను ఉపయోగించి నేలమట్టం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

ముందస్తు సమాచారం లేదు

ఇంద్రజ, వేణుగోపాల కాలనీ

వేణుగోపాల కాలనీలో తొమ్మిదేళ్ల ముందు ప్లాట్లను కొనుగోలు చేసి, సౌలభ్యంగా ఇంటిని నిర్మించుకున్నాం. సోమవారం రాత్రి వందలమంది యువకులు జేసీబి యంత్రాలతో వచ్చి భయభ్రాంతులకు గురిచేశారు. ఇళ్లల్లోనుంచి బలవంతంగా బయటకు రావాలని చెబుతుంటే చిన్నపిల్లలున్నారని ప్రాధేయపడినా వినలేదు. ఇన్నేళ్లుగా కాపురం ఉంటున్న మాకు స్థలం వివాదంలో ఉందని తెలియదు. మాకు అమ్మిన వారు ఎవరూ చెప్పలేదు. కనీసం ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే కొనుగోలు చేసిన వస్తువులనైనా భద్రంగా పెట్టుకునేవాళ్లం. అధికారులు లోతైన దర్యాప్తు చేసి మాకు న్యాయం చేయాలి.

పోయిన నెల్లోనే రూ.23 లక్షలకు కొన్నా : చంద్రకళ, గోవిందనగర్, తిరుపతి

రిజిస్ట్రేషన్ స్థలమని, కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో మంచి రేటు ఉంటుందని సుబ్రమణ్యం అనే వ్యక్తి నమ్మబలికాడు. ఈ ఏడాది ఏప్రిల్ 7న సుబ్రమణ్యం స్వాధీన అనుభవంలోని స్థలాన్ని 23 లక్షలకు విక్రయిస్తూ రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. సోమవారం రాత్రి నేను కొనుగోలు చేసిన ఇంటిని నేలమట్టం చేశారని తెలిసి కంగారుగా పరిగెత్తుకుంటూ వెళ్లాను. అక్కడికి వెళ్లి చూస్తే నా ఇల్లే కాదు, కాలనీనే లేకుండా పోయింది. ఇప్పటికీ నాకు ఇంటి పన్ను కూడా మార్చలేదు. అధికారులు నేను వెచ్చించిన 23 లక్షల రూపాయలను తిరిగి ఇప్పించాలి.



అభినందనల వెల్లువ

బాధ్యతలు స్వీకరణ

బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ గుడారు జగదీష్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రి వద్దకు చేరుకున్న ఆయనకు ఆసుపత్రి అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదం అనంతరం ఆయన డైరెక్టర్ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సుదీర్ఘకాలం బర్డ్ హాస్పిటల్ డైరెక్టర్గా సేవలందించానని, ఇక్కడ పరిస్థితులన్నీ తనకు క్షుణ్ణంగా తెలుసన్నారు. త్వరలో ఇక్కడ పరిస్థితులన్నీ చక్కదిద్ది, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారి ఆరోగ్యం స్వస్థత చేకూర్చేందుకు కషి చేస్తానని తెలిపారు. రెండవ సారి తనకు ఈ అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు గజమాలలు వేసి, పుష్పగుచ్చాలు అందించి, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ దొడ్డారెడ్డి మునిసుబ్రహ్మణ్యం రెడ్డి, రాయలసీమ డ్రగ్స్ అధినేత దామోదర్ నాయుడు, మెగా మెడికల్స్ అధినేత గుప్తా, ఆంధ్ర సర్జికల్ అధినేత నరేంద్ర పాల్గొన్నారు. ఆస్పత్రి ఎంఎన్ఒలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భరద్వాజ్, సుధాకర్ నాయుడుపాల్గొన్నారు.

అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఆస్పత్రి పురోభివృద్ధికి కృషి : గుడారు జగదీష్

సుదీర్ఘ కాలంగా బర్డ్ ఆసుపత్రికి పూర్తిస్థాయి డైరెక్టర్ లేకపోవడంతో వైద్యసేవలు కుంటుపడ్డాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బర్డ్ సంచాలకులుగా డాక్టర్ గుడారు జగదీష్ ను నియమించింది. ఆ మేరకు టీటీడీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు బుధవారం ఉదయం స్విమ్స్ సర్కిల్లోని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం బర్డ్ ఆసుపత్రికి చేరుకుని నూతన సంచాలకులుగా పదవీ బాధ్యతలు చేపట్టారు ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగా బర్డ్ ఆసుపత్రి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆసుపత్రికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా సేవలను విస్తరిస్తామని డాక్టర్ జగదీష్ ధీమా వ్యక్తం చేశారు.

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

వంద మీటర్ల త్రివర్ణ పతాకంతో సమైక్యతా యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం.. మతసామరస్యాన్ని కాపాడుకుందాం' అంటూ వామపక్ష, లౌకికవాదులు ఉద్ఘాటించారు. వంద మీటర్ల త్రివర్ణపతాకంతో తిరుపతి పురవీధుల్లో బుధవారం సమైక్యతా యాత్ర నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం మీదుగా యాత్ర సాగింది. వంద మీటర్ల త్రివర్ణ పతాకాంతో ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ నగర కార్యదర్శి జె.వివ్వనాథం, దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య, నాయకులు రఫీ హిందూస్తానీ పాల్గొని ప్రసంగించారు. ఉగ్రదాడిని ఖండించడంలో ప్రదర్శించిన ఐక్యత సమైక్యత స్ఫూర్తిని ఒక్కతాటిపై నిలిపిందన్నారు. ఉగ్రవాదులు దేశంలో విభజననను తీసుకురావాలని మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మోడీ ప్రభుత్వం ట్రంప్‌ను విశ్వ గురువుగా భావించి సలాం కొడుతోందని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సింధూర్ జయప్రదం అయ్యిందని, కాల్పులు ఎందుకు కొనసాగాయన్నారు. ఉన్నట్లుండి ఎందుకు విరమించారని ప్రశ్నించారు. కాల్పుల విరమణ విషయంలో ట్రంప్ చెప్పినట్లు నడుచుకుని ప్రధాని మోడీ దేశ ప్రతిష్టకు భంగం కలిగించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, మాధవకృష్ణ, పి.బుజ్జి, హేమలత, నరేంద్ర, జి.బాలసుబ్రమణ్యం, మునిరాజా, రాధాక్రిష్ణ, జయంతి, సుందరం, బాదుల్లా, ఎండి రవి, కెవైరాజా పాల్గొన్నారు.

తిరుపతి పురవీధుల్లో సమైక్యతా ర్యాలీ

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్,యంత్రాంగం

ఎన్టీఆర్ యుగపురుషుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని వక్తలు ఉద్ఘాటించారు. నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తిరుపతిలో ఎన్టీఆర్ చిత్రపటానికి కమిషనర్ ఎన్.మౌర్య, స్టేట్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన తరువాత సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల ప్రేమ మాత్రమే గొప్పదని చెప్పిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్, ఆర్డీవో రామ్మోహన్, డి.ఈ వో, రవికుమార్, జిల్లా టూరిజం అధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

- తిరుపతి సిటీ : ఎన్టీఆర్ తెలుగు జాతికి గుర్తింపు తీసుకొచ్చారని ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు పేర్కొన్నారు. సమయపాలన అంశంలో ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన నటనా చాతుర్యం, రాజకీయ చతురత తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, కె. ఆదిశేషయ్య, జనరల్ మేనేజర్లు ప్రసాద్, వెంకట రాజు, రామచంద్ర రావు, సురేంద్ర రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రి ఆవరణలో దాదాపు 200 మంది రోగులకు అన్నదానం, పండ్లు వితరణ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ మొర్రి మేకల దేవరాజులు, సాంబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో... ఎంఎల్ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నేతలు మునిరాజనాయుడు, మునికృష్ణ, బుజ్జి పాల్గొన్నారు.

- రామచంద్రాపురం (చంద్రగిరి) : పట్టణ అధ్యక్షులు సక్కూరు ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సమీపంలో నివాళి అర్పించారు. ఎన్టీఆర్ వ్యక్తి కాదు శక్తి అని అన్నారు. మాజీ జడ్‌పిటిసి వీరంగారి రమేష్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ షేక్ గౌస్‌బాష, మండల అధ్యక్షులు బాలకృష్ణ పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో... ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, చలనచిత్ర నటుడిగా అనేక మరపురాని పాత్రల్లో నటించి జీవించి తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ధన్యజీవి ఎన్టీ రామారావు అని డాక్టర్ చంద్రమౌళి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలు నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ వీరయ్య, దేవకి, నరసింహులు, జెకెసి మెంటార్ కిషోర్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రసూల్ పాల్గొన్నారు. అంబేద్కర్ కూడలి వద్ద పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

- గూడూరు టౌన్‌లో.. గమళ్లపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య పాల్గొన్నారు.

- రేణిగుంటలో.. క్లస్టర్ ఇన్‌ఛార్జి పుష్పనాధన్, వన్నెకుల రాష్ట్ర డైరెక్టర్ చిన్నారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్, క్రిష్టియన్ సెల్ కార్యదర్శులు ఉదయ్, రవి పాల్గొన్నారు.



తిరుపతి, శ్రీకాళహస్తిలో ఎన్టీఆర్‌కు నివాళి

ఊరికి దిష్టి...! ఈ.. 'బృందావనాలు'

బృందావనం తొట్టెల్లో మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి - ఏర్పేడు

చెత్త నుంచి సంపద వస్తుందో లేదో గానీ, మందుబాబుల అడ్డాగా ఉన్న బృందావనాల్లో మద్యం బాటిళ్లు అమ్ముకుంటే పదో పరకో ఆదాయం రాక మానదు.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతోంది.. టిడిపి హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు' మండలంలో నిరుపయోగంగా మందుబాబుల అడ్డాగా ఉన్నాయి. ఒక బృందావనం.. పది మంది మందుబాబులు అన్న చందాన తయారయ్యాయి. టిడిపి హయాంలో నిర్మిస్తే వైసిపి గాలికొదిలేయడం, వైసిపి హయాంలో నిర్మిస్తే టిడిపి గాలికొదిలేయడం వల్ల లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు గాలికి కొట్టుకుపోవడమే గాకుండా, బృందావన షెడ్లు శిథిలావస్థలో రేపోమాపో కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఏర్పేడు మండలంలో 40 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకూ 36 గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా టిడిపి హయాంలో నిర్మించారు. గతంలో పాపానాయుడుపేటలోని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం ప్రకృతి వైపరీత్యాల వల్ల పూర్తిగా ధ్వంసమయ్యింది. ప్రస్తుతం 35 కేంద్రాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ పంచాయతీల్లో నిర్మించిన అన్ని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని భావించింది. ప్రతి నెలా మూడో శనివారం గ్రామ పంచాయతీ అధికారులు, మండలాధికారులు, ఉన్నతాధికారులు కలిసి 'స్వచ్ఛ ఆంధ్ర... స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తడిపొడి చెత్త ద్వారా సంపద తయారు చేసే ప్రక్రియ గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నది లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో ఈ పరిస్థితి లేదు. చీపుర్లు పట్టుకుని 'షో' ఇస్తూ ఫొటోలు తీసుకోవడం వల్ల 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' తూతూమంత్రంగానే మండలంలో నడుస్తోందన్న విమర్శలు లేకపోలేదు. మండలంలోని మోదులపాలెం గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం నిరుపయోగంగా మారి ముళ్లపొదలతో, మద్యం బాటిళ్లతో దర్శనమిస్తూ, చెత్తను నింపే తొట్టెలు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరువగా ఉన్నాయి. తడిపొడి చెత్తను వేరుచేసి ఎరువులను తయారు చేసి, రైతులకు అమ్మడం ద్వారా సంపద సృష్టించాలన్న లక్ష్యంతో నిర్మించిన ఈ బృందావనాలు పంచాయతీల్లో దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. ఇఒఆర్‌డి రమణకుమార్‌ను వివరణ కోరగా సర్పంచులు సపోర్టు చేయడం లేదని చెప్పడం గమనార్హం. పొలిటికల్ ఇబ్బంది ఉందని తెలిపారు.

పంచాయతీకి నిధుల్లేవు :

యానాది జయరామయ్య, సర్పంచి

పంచాయతీ నిధులు కావలసినంత లేకపోవడంతో మరమ్మతుకు గురైన ట్రైసైకిళ్లను, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని మనుగడలోకి తీసుకురాలేకపోతున్నాం. ప్రస్తుతం చెత్త సేకరణ ప్రక్రియ అమల్లో లేదు.

అదనపు గదుల నిర్మాణం ప్రారంభం

భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సంయుక్త నగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు మల్లె మాల మురళీ రెడ్డి, పాఠశాల కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ దంపతులు, దువ్వూరు యుగంధర్, డాక్టర్ జనార్దన్ రెడ్డి, గూడూరు పుర ప్రముఖులు, పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానాచార్యులు వి రంగనాయకులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో అర్హులందరూ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు శ్రీదేవి పేర్కొన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలోని సచివాలయంలో రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైస్ కార్డులలో పిల్లలు, కోడలను జతచేయటం, సభ్యుల తొలగింపు, కొత్త రైస్ కార్డు, కార్డు విభజన, చిరునామా మార్పులు చేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు కొన్ని పత్రాలను జత చేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం: ఈఈ

ప్రజాశక్తి తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలోని ఈస్ట్ సెక్షన్ లోని 33/11 కెవి ఫీడర్ల విద్యుత్ మరమ్మతులు, ట్రీ కటింగ్ క్లియరెన్స్ పనులకు సంబంధించి ఈ నెల 29 తేదీ గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ చిన్నకోటి చంద్ర శేఖర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కె.వి రెడ్డి, రెడ్డి కాలనీ, దొడ్డాపురం వీధి, కె లేఔట్, బిక్షగ్, పరసర ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ సరఫరా అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మహానాడులో కోట నాయకులు

ప్రజాశక్తి -కోట: కడప మహానాడుకు కోట మండల సీనియర్ టిడిపి నాయకులు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను కలిశారు. కోట మండలం నుండి తిరుపతి పార్లమెంట్ మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్, మద్దాలి సర్వోత్తమ రెడ్డి, నెల్లూరు కోఆపరేటివ్ రైతు విభాగ అధ్యక్షులు నెల్లూరు మోహన్ రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ కోళ్ల మదు యాదవ్, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, తిరుపతి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి, తదితరులు కలిశారు.

ఏర్పేడు : కడప మహానాడులో ఏర్పేడు మండల టిడిపి అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, మాజీ సర్పంచ్ రాయపనేని రవినాయుడు, గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ చైర్మన్ గిరినాయుడు, కిరణ్, గోల్డ్ మ్యాన్, కిశోర్ సుబ్రమణ్యం, నరేంద్ర నాయుడు, బాలాజీ, ఆమందూరు సర్పంచ్ గురువారెడ్, హరియాదవ్, మునిరాజా యాదవ్, శివారెడ్డి, రాచేటి కృష్ణయ్య పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : కడప మహానాడుకు చెన్నూరు టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపునీరు నిలవకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోతుందని, సజావుగా వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతుల పరిష్కారంలో భాగంగా బుధవారం ఉదయం 12వ వార్డు లోని ఎన్ టీ వీ నగర్, వెంకట రెడ్డి కాలని, గాంధీపురం, కెనడీ నగర్, పాత తిరుచానూరు రోడ్డులో కార్పొరేటర్ ఎస్.కె.బాబు, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలన చేశారు. వెంకటేశ్వర థియేటర్ వద్ద ఏర్పాటు చేయనున్న రైల్వే బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజ్ కాలువలు శుభ్రం చేయించాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, ఏసీపీ బాలాజీ, డి.ఈ.లు మహేష్, రాజు, శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.

చంద్రబాబుకు బొజ్జల శుభాకాంక్షలు

చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి జాతీయ అధ్యక్షులుగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కడపలో బుధవారం రెండో రోజు మహా నాడులో చంద్రబాబును టిడిపి జాతీయ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ లోని ప్రగతి కార్యాలయంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సహకారంతో నిరుపేదలు15 కుటుంబాలకు18 రకాల నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ లైఫ్ టైం ప్రాజెక్ట్‌గా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన పొనకా మల్లికార్జున్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాత్రమే కాక ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని పేదవారికి కుట్టు మిషన్లు, ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై సైకిళ్ల పంపిణీకి ఆర్థిక సాయం చేశారన్నారు. ముఖ్య అతిథి వాస్తు సిద్ధాంతి వల్లమేటి మోహన్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ తన నాలుగేళ్ల ప్రస్థానంలో అన్ని రకాల, అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిం చిందన్నారు. ఆ సంస్థ బాగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు , వాకాటి రామ్మోహనరావు , పీడీ కరిముల్లా , టీచర్ మామడూరు రాధయ్య , కుమార్ నాయుడు, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒకే దారి..అన్నీ సమస్యలే !

- వాహన రాకపోకలకు ఇక్కట్లు
- ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి

ఇరుకు రహదారి కావడంతో వెళ్లేందుకు ఇబ్బందులెదుర్కొంటున్న 108 వాహన డ్రైవర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గేట్ పుత్తూరులో వున్న ఒకే దారిపై ఆధారపడి సుమారు 15 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. గేట్ పుత్తూరులో వున్న ఒకే దారి వల్ల ట్రాఫిక్ స్తంభించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గేట్ పుత్తూరు ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. ఆస్పత్రికి, రైల్వే స్టేషన్, బ్యాంకుకు వెళ్లాలన్నా అదే దారి తప్ప వేరే మార్గంలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని గేట్ పుత్తూరు ప్రజలు వాపోతున్నారు. గేట్ పుత్తూరులో 15 వేల మంది ప్రజలు, తొమ్మిది మున్సిపల్ వార్డులు వున్నాయి. వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా, రావాలన్నా వున్న రైల్వే అండర్ బ్రిడ్జి ఒకే మార్గమని స్థానికులు చెబుతున్నారు.

ముఖ్యంగా విద్యార్థులకు ఈ దారి ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చెస్తున్నారు. ప్రతి రోజూ స్కూల్, కాలేజీకి వెళ్లే విద్యార్థులు అదే మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. మార్గంలో ట్రాఫిక్, ఆర్‌డిఎం రైల్వే గేట్లు మూసుకుపోవడం వల్ల ఆలస్యం అవుతోందని, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గేటు పుత్తూరు వాసులు తెలిపారు. విద్యార్థులకు సైతం వారి విద్యపై ప్రభావం చూపుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గర్భిణులకు, వృద్ధులకు సవాలుగా మారిందని అంటున్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి

ఆక్సిజన్ స్థాయి పడిపోవడం, పాలు తాగించాల్సిన శిశువుల తల్లులు, వృద్ధులు అన్నీ అదే దారిని ఉపయోగించాల్సి వుంది. తక్షణ వైద్యం అవసరమైన సమయంలో రోడ్డులో చిక్కుకుపోవడం వల్ల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతోందని పుత్తూరు ప్రజలు వాపోతున్నారు. వాణిజ్య కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, చిరు వ్యాపారాలు, చిన్న చిన్న దుకాణాల సరుకుల సరఫరా కూడా రవాణా అంతా అదే రహదారి ద్వారా సాగుతోంది. తరచూ ట్రాఫిక్ జామ్‌లు, రైల్వే గేట్లు మూసి వేయడాలు, వాణిజ్య అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది. అంబులెన్స్ కోసం ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో తరచూ గేట్ పుత్తూరు ప్రజలకు ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం వుందని తెలిపారు. ఏదైనా అత్యవసర వైద్య పరిస్థితులలో అంబులెన్స్ ఈ రద్దీ మార్గంపైనే ఆధారపడాల్సి ఉందన్నారు. రహదారిలో ట్రాఫిక్ జామ్ అయితే ప్రాణాలే పోతాయని భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ ట్రాఫిక్‌లో భద్రతా లోపాలు అధికంగా ఉన్నాయన్నారు. ఒకే మార్గం ఉండటం వల్ల రాత్రివేళలో లైటింగ్ లేకపోవడం, గమనార్హం. మహిళలు ఒంటరిగా వెళ్లడం వల్ల చోరీలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

భారీ వర్షాలు వస్తే అంతే సంగతులు !

బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోతుందన్నారు. అప్పుడప్పుడూ ఈ రైల్వే అండర్ బ్రిడ్జిలో డ్రైనేజీ వాటర్ లోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈదారిపై ప్రజల అభిప్రాయాలు, నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా సంబంధిత శాఖా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని గేట్ పుత్తూరు ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సిసితో బహుళ ప్రయోజనాలు

ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ

గ్రూప్ కమాండర్ సతిందర్ దహియకు వందన సమర్పణ చేస్తున్న క్యాడెట్లు

ప్రజాశక్తి -రామచంద్రపురం: విద్యార్థులు ఎన్‌సిసి శిక్షణ పొందడం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్లతో పాటు బహుళ ప్రయోజనాలను పొందవచ్చని ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ పేర్కొన్నారు. మండలంలోని సి రామాపురం లోని వెరిటాస్ సైనిక స్కూల్ ఆవరణలో 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరాలను బుధవారం నిర్వహించారు. గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ, ట్రైనింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సందీప్ శంకర్‌లు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లను ఉద్దేశించి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ మాట్లాడుతూ ఎన్‌సిసి శిక్షణతో సర్టిఫికెట్ పొందితే దేశ రక్షణ విభాగాలైన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీలలో ఉద్యోగాలను సులభతరంగా పొందవచ్చన్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సందీప్ శంకర్ మాట్లాడుతూ ఎన్‌సిసి శిక్షణ పొందడం వల్ల క్యాడెట్లు యూనిటీ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్యాంప్ కమాండర్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ శిబిరంలో నైతిక విలువలతో కూడిన శిక్షణను అందిస్తున్నామన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఎన్‌సిసి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం ఆర్మీ, ఎయిర్ వింగ్ విభాగాలలో క్యాడెట్లకు ఇస్తున్న శిక్షణను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు శిక్షణ శిబిరంలో భోజన వసతులు, శిక్షణలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా?' అడిగి తెలుసుకున్నారు. వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో ఎన్‌సిసి శిక్షణా తరగతులు అద్భుతంగా నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండర్ శ్రీనివాసులు, క్యాంపు పర్యవేక్షకులు కే గుణశేఖర్, సీనియర్ ఏఎన్‌ఓలు ఉదయ్, రాజశేఖర్, ఎన్‌సిసి క్యాడెట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యతా యాత్రను జయప్రదం చేయాలి: సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేడు పట్టణంలో పార్టీ కార్యాలయం నుండి ప్రారంభించనున్న సమైక్యతా యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య అధ్యక్షతన సిఐటియు కార్మిక సంఘం, ప్రజాసంఘాలు, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నేడు గురువారం జక్కా వెంకన్న వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పార్టీ కార్యాలయం నుండి ఉదయం 11.30 గంటలకు సమైక్యతా యాత్రను ప్రారంభిస్తామని పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, సానుభూతిపరులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, భవన నిర్మాణ సంఘ నాయకులు పుట్టా శంకరయ్య, గండికోట మధు, నాయకులు పామంజి మణి, నాయకులు అడపాల ప్రసాద్, ఆటో సంగ నాయకులు బి రమేష్ ఎం నాగేంద్ర, సుధాకర్, బి చంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.

యోగాతో మానసిక రుగ్మతలు మాయం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: యోగాతో మానసిక రుగ్మతలు మాయం అవుతాయని యోగా శిక్షకులు సురేష్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆయన యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని వార్డు సచివాలయాల పరిధిలో యోగా పోటీలు మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 42 మందికి, పుత్తూరు పురపాలక సంఘ కార్యాలయంలో 40 మందికి, హిమజ డిగ్రీ కళాశాల కల్యాణపురంలో 42 మందికి యోగా యోగ శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీసీ బహిరంగ సభ సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బీసీలు, బహుజనుల హక్కుల సాధనే లక్ష్యంగా నిర్వహించనున్న బీసీ బహిరంగ సభ నిర్వహణ కోసం సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజా గౌడ్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 22న బిసి ఆత్మ గౌరవ భరోసా సభను ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేద్కర్ పూలే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. బీసీ బహుజనుల హక్కుల కల్పనలో ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో విఫలమయ్యాయని దుయ్యబట్టారు. బీసీ ఆత్మగౌరవ భరోసా సభ ద్వారా బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటీల గలాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చాటుతామన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో మధు ఆచారి, సోమశేఖర్, గిరి, విజయ్, నాగేంద్ర, జగదీష్ పాల్గొన్నారు.

మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలకు బ్యాంకుల సహకారం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : మామిడి జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకు వారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్ బ్యాంకు అధికారులను కోరారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లాలోని బ్యాంకు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మామిడి జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకు వారు మంజూరు చేసిన రుణాలు రీషెడ్యూల్ చేయడంలో సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ జి రవికుమార్ పాల్గొన్నారు.

స్విమ్స్ నిర్మాణాలు పరిశీలించిన టిటిడి ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనాలను టిటిడి ఈవో జె శ్యామల రావు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ముందు రోగుల సహాయక వసతి గృహంలోని రోగులు వేచివుండే గదులు, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అక్కడే వున్న రోగులతో అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. స్విమ్స్ అందిస్తున్న వైద్య సేవలపై రోగులు సంతోషం వ్యక్తం చేశారు. రోగులు ఏ ప్రాంతం నుండి వచ్చారు, ఎలాంటి వైద్యం కోసం వచ్చారు తదితర విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, సిటి సర్జరీ తదితర వైద్య సేవల కోసం నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. అటు తర్వాత సెంట్రల్ కిచెన్, సెంట్రల్ మెడికల్ స్టోర్స్ భవనాలను, స్విమ్స్ శ్రీ పద్మావతీ ఆసుపత్రిని, నిర్మాణంలోని కేన్సర్ ఇన్ స్టిట్యూట్ , స్టాఫ్ క్వార్టర్స్‌ను, శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయం భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వి వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్వీ కుమార్, మెడికల్ సూపరింటెంటెండ్ డాక్టర్ రామ్, సీఈ టివి సత్యనారాయణ, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.72 కోట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్లకు, పరివార దేవతలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం ఒక కోటీ 72 లక్షలా 70 వేలా 504 రూపాయలు వచ్చింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కించారు. బంగారం 0.73 గ్రాములు, వెండి 607 కిలోలు, 92 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు డిప్యూటీఈవో కష్టారెడ్డి తెలిపారు.

అదనపు ఈవో తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల అలిపిరి కాలినడక మార్గంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుండి ఏడవ మైలు వరకు ఉన్న అటవీ ప్రాంతాన్ని బుధవారం టీటీడీ అదనపు ఈవో సిహెచ్‌వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. టీటీడీ అటవీ శాఖ, రాష్ట్ర అటవీశాఖ అధికారులతో కలిసి ఆయన కాలిబాట మార్గాన్ని పరిశీలించారు. నడకదారిలో ఏర్పాటు చేసి ఉన్న స్టాటిక్ కెమెరాలు, మోషన్ సెన్సార్ కెమెరాల పనితీరును ఆయన సమీక్షించారు. అటవీ ప్రాంతంలో మానవ– వన్యప్రాణి ఘర్షణ సమస్యను ఎదుర్కోడానికి తాత్కాలికంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ నిఘా వీజీవో రామ్ కుమార్, టీటీడీ అటవీ రేంజ్ అధికారి దొరస్వామి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పనితీరు భేష్

- యంత్రాలతో మెరుగ్గా పారిశుధ్య పనులు చేపట్టాలి
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్ కుమార్

మాట్లాడుతున్న సంపత్‌కుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పనితీరు భేషుగ్గా వుందని, యంత్రాలతో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్ , డైరెక్టర్ సంపత్ కుమార్ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్ మౌర్య అధ్యక్షతన ఆర్‌డి విశ్వనాథ్‌తో కలసి వివిధ విభాగాల అధిపతులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధి, విభాగాలు, విధులు, తదితర విషయాలను కమిషనర్ ఎన్ మౌర్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో అన్ని విభాగాల పనితీరును అభినందించారు. మరింత మెరుగ్గా పలితాలు వచ్చేలా పనిచేయాలన్నారు. నగరంలో వందశాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద నుండి చెత్త వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని, దోమలు పెరగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పన్నుల వసూళ్లలో మరింత వేగం పెంచాలని, నగరపాలక సంస్థ పరిధిలో విద్యుత్ ఛార్జీలు తగ్గేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాల మరమ్మతులు, డీజిల్ వినియోగం తగ్గించాలన్నారు. నైట్ షెల్టర్ నిర్వహణ బాగా ఉండేలా చూడాలని, టౌన్ ప్లానింగ్ విభాగం పక్కా ప్రణాళికతో పనిచేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కు ఆదాయం వచ్చే అన్ని మార్గాలను అన్వేషించాలని ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, మేనేజర్ హసీమ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిఈలు, ఏసిపిలు పాల్గొన్నారు.

జనతా క్లినిక్‌లో 'స్వర్ణ బిందుప్రాశన'

- ఆయుర్వేదంలో రోగ నిరోధక కార్యక్రమం
- 0 నుండి14 సంవత్సరాల లోపు పిల్లలకు చికిత్స

ప్రజాశక్తి-కోట : పిల్లలకు ఆయుర్వేదంలోని రోగనిరోధక కార్యక్రమంలో భాగంగా 14 సంవత్సరాలలోపు పిల్లలకు జీర్ణ పక్రియ, జ్ఞాపకశక్తి మెరుగుపరచడంతో పాటు చర్మకాంతిని కూడా పెంచుతుందని జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్ జగదీష్ తెలిపారు. బుధవారం డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ 'మీ బిడ్డకు బంగారు ఆరోగ్యం కోసం ఒక చుక్క బంగారంతో జ్ఞాపకశక్తి, గ్రహణ శక్తి పెంచడంలో సహాయపడుతుందన్నారు. శ్రద్ధ ఏకాగ్రత, అభ్యసన సామర్థ్యాలు, పిల్లలు అన్ని విషయాలపై చురుగ్గా తెలివిగా ఉంటారన్నారు. ఉత్తమ రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా బిడ్డను బలంగా చేస్తుందని, అంటువ్యాధులు, అలర్జీల నుండి బలమైన రక్షణకు సహాయపడుతుందన్నారు. దంతాలు ఏర్పడే దశలో వచ్చే వ్యాధులను నివారించడం, సీజనల్ మార్పుల వల్ల వచ్చే వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తూ భౌతిక అభివృద్ధిలో భాగంగా వినికిడి శక్తి ప్రసరణ, దృష్టి తీక్షతను మెరుగుపరుస్తూ మనసు, శరీరం వేగంగా చురుకుగా మారుతుందన్నారు. ఆకలి, జీర్ణక్రియకు తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ స్వర్ణ బిందుప్రాసనను కనీసం 24 నెలలు ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వారు కోట మండలం ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న జనతా క్లినిక్ ఆసుపత్రిలో 97385 77366,96424 14572 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

క్రైం న్యూస్

గంజాయి కేసులో మరొకరు అరెస్ట్

పోలీసులు అదుపులో నిందితుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గంజాయి కేసులో మరొకరిని టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సర్కిల్ వద్ద తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన సురేష్(48)ను అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించారు. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. పట్టుబడ్డ సురేష్‌పై తమిళనాడులో 38కి పైగా క్రిమినల్ కేసులు, రౌడీ షీట్ ఉన్నట్లు సీఐ వివరించారు.

గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతి

మృతి చెందిన లారీ డ్రైవర్ ధనశేఖర్

ప్రజాశక్తి -దొరవారిసత్రం: గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి తడ మండల పరిధిలో ఉన్న శ్రీ సిటీ కంపెనీకి సంబంధించిన మెటీరియల్ లారీ తీసుకుని వెళుతున్న డ్రైవర్ ధనశేఖర్ (41) మండల పరిధిలోని టపాఇండ్లు గ్రామాన్ని సమీపిస్తుండగా మంగళవారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. లారీని డివైడర్‌పై వుంచి గుండె నొప్పితో బాధపడుతుండగా అటు ఇటు వెళుతున్న వాహనదారులు గమనించి స్వర్ణ టోల్‌వే అంబులెన్స్‌కు ఫోను చేయడంతో వారి అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స చేశారు. అనంతరం సూళ్లూరుపేట హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఈ విషయం పోలీసులకు తెలపడంతో పోలీసులు మృతుడు బంధువులకు తెలిపారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మేకలు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రైలు ఢీకొని మేకలు మృతి చెందిన ఘటన పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. దిగువ కనక పాళ్యెం దళిత వాడకు చెందిన ఓ చిన్నయ్య మేకలను మేతకు తీసుకు వెళుతుండగా రైలు బ్రిడ్జి పట్టాలు దాటడానికి ప్రయత్నించాయి. తిరుపతి నుంచి చెన్నయ్‌కి వెళుతున్న రైలు మేకలను ఢీకొనడంతో పది మేకలు చనిపోయాయని మేకల యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు సలహాలు చాలా విలువైనవని జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీ, బి ఎల్ ఓ తదితర అంశాలపై డి ఆర్ ఓ నరసింహులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, డిటి ఉషారాణి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను పరిశీలిస్తున్న ఎక్సైజు సూపరింటెండెంటు నాగమల్లేశ్వరరెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- తిరుపతి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మద్యం దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తిరుపతి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ మల్లేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి గూడూరు పట్టణ, చిల్లకూరు పరిధిలోని మద్యం దుకాణాలను పరిశీలించారు. మద్యం దుకాణాల చుట్టూ పక్కల మద్యం ఎవరూ తాగకూడదని తెలిపారు. అనంతరం మద్యం దుకాణదారులు సమయపాలన పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈయన వెంట గూడూరు , ఎక్సైజ్ సిబ్బంది కరీమా బేగం, శేషమ్మ, పాల్గొన్నారు.

గంగ జాతర చాటింపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాడపేట మండల శ్రీ బొమ్మరాజపురం గ్రామ పంచాయతీలో గంగమ్మ జాతర పురస్కరించుకొని మంగళవారం రాత్రి ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో గంగ జాతర చాటింపు ఘనంగా నిర్వహించారు. ఆదివారం 1వతేదీన అమ్మవారి ఊరేగింపు, సోమవారం 2వ తేదీ అమ్మవారి ఊరేగింపు, మంగళవారం 3వతేది గంగ జాతర అదే రోజు ఉదయం అమ్మవారికి అంబలితో నైవేద్యం, సాయంత్రం కుంభాలతో నైవేద్యం సమర్పణ వుంటుందన్నారు. తర్వాత గ్రామ పుర వీధులలో గంగ మ్మ వివిధ రకాల విశేష పుష్పా అలం కరణతో అంగ రంగ వైభవంగా ఊరేగిస్తారు.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE OF SRIKALAHASTHI
O.S.No.395 / 2023
Kommi Aasharani, W/o K. Anil Kumar ...Plaintiff
V/s
Mainum Balaji, S/o Late M. Subramanayam ...Defendant
SUIT SUMMONS TO DEFENDANT
Mainum Balaji, S/o Late M. Subramanayam, D.No.18-1-439/A, Bhavani Nagar, Tirupati -1,
The plaintiff has filed above suit against you for recovery of suit amount due basing on the registered simple mortgage deed dt.16-10-2021, is stands posted to 26-06-2025 for your appearance either in person or through Advocate to raise objections if any, else the matter will be decided exparte.
P.HEMACHANDRA REDDY
19-45-59-236, BAIRAGIPATTEDA, TIRUPATI

చట్టపరమైన ఆటంకాలు లేవు

సాయి విద్యానికేతన్ జూనియర్ కళాశాల ఆత్మీయ సమావేశంలో హైకోర్టు న్యాయవాది మతుకుమిల్లి విజయ్

మాట్లాడుతున్న మతుకుమిల్లి విజయ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ (చిల్లకూరు): సాయి విద్యానికేతన్‌కు చట్టపరమైన ఆటంకాలు ఏవీ లేవని హైకోర్టు న్యాయవాది, లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి విజయ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయవాది, సీనియర్ లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి విజయ్ మాట్లా డుతూ ఇటీవల సాయి విద్యానికేతన్ సంస్థల అభివృద్ధి చూసి ఓర్వలేని కొంతమంది అసూయతో చిల్లకూరు లోని సాయి విద్యానికేతన్ కళాశాలకు వచ్చిన పర్మిషన్‌పై హైకోర్టుని ఆశ్రయించారు. మొదటి సంవత్సరం 86 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలలో డివిజన్‌లో అత్యధిక మార్కులు సాధించి డివిజన్‌కి ఆదర్శంగా నిలిచిందని, ఈ శుభసందర్భంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. త్వరలో చట్ట పరమైన అంశాలు తొలగిపోతాయని అధ్యాపకులు, తల్లితండ్రులు ఎలాంటి అపోహలకు లోను కావొద్దని తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో కొంతమంది అసూయ పరులు హైకోర్టులో వున్న అంశంపై వారికి నచ్చినట్లు రాసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటివారు తక్షణమే ఆ చర్యలను ఆపాలని, లేకుంటే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని విజయ్ హెచ్చ రించారు. ఆ కళాశాల అభివృద్ధికి కృషిచేసిన అధ్యాపకులను అభినందించారు. కళాశాల ఛైర్మన్ బి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ని దుష్టశక్తులు ఎదురొచ్చిన సమర్థవంతంగా ఎదుర్కొంటామని అధ్యాపకులకు, తల్లితండ్రులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవితేజ, సాయి విద్యానికేతన్ డైరెక్టర్ నరేందర్ రెడ్డి, వెంకట్ , అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌వియూ పరీక్షల డీన్‌గా సురేంద్ర బాబు

సురేంద్రబాబుకు నియామక పత్రం అందిస్తున్న విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పరీక్షల డీన్ గా ఎస్వీయూ లైబ్రేరియన్ ఆచార్య కె సురేంద్ర బాబును నియ మిస్తూ విశ్వ విద్యాలయం ఇన్‌చార్జ్ ఉప కులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉత్తర్వులు అందించారు. కాగా సురేంద్ర బాబు దశాబ్ద కాలంగా ఎస్వీయూ గ్రంథాలయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 25 సంవత్సరాలుగా అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

ఉత్కంఠ పోరులో ఫైనల్‌కు హైపీరియన్ జట్టు

- సిడిసిఎ సెక్రటరీ జట్టుపై ప్రసిడెంట్ జట్టు విజయం - ఫైనల్ విజేతలకు ట్రోఫీ అందించనున్న కలెక్టర్, కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఉత్కంఠంగా బుధవారం సాగిన సిపిఎల్- 1 సెమీ ఫైనల్ మ్యాచ్‌లో హైపీరియన్ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఇప్పటికే ఫైనల్ బర్త్ ఖాయం చేసుకున్న పాయ్ వైస్రాయ్ జట్టుతో నేడు హైపీరియన్ జట్టు పోటీ పడనుంది. ఈ ఫైనల్ మ్యాచ్ విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతి అందించేందుకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్(క్రికెట్ విజయ్) తెలిపారు.

ఫైనల్‌కు ఐపీరియన్ జట్టు

చిత్తూరు ప్రీమియర్ లీగ్ సిపిఎల్-1 లో భాగంగా బుధవారం మధ్యాహ్నం పోటా పోటీగా సాగిన సిపిఎల్-1 సెమీఫైనల్ మ్యాచ్‌లో హైపీరియన్ జట్టు ఆదిత్య లెవెల్స్ జట్టుపై రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 166/8 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో కెప్టెన్ కల్యాణ్ 63(37), అభిషేక్ 21(14) పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో అచ్యుతానంద, మహమ్మద్, సయ్యద్ అఖిబ్ తలా రెండు వికెట్లు తీసుకున్నారు. 167 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైపిరియన్ జట్టు 19.3 ఓవర్లలో 168/8 పరుగులతో విజయం సాధించింది. బ్యాటింగ్‌లో చారుకేష్ 54(24), భవాని ప్రసాద్ 32(26), హర్షారెడ్డి 38(32) పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. చారుకేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. దీంతో గురువారం సాగే ఫైనల్ మ్యాచ్ లో పాయ్ వైస్రాయ్ జట్టుతో హైపీరియన్ జట్టు తలపడనుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కైవసం చేసుకున్న చారుకేస్‌కు సిడిసిఏ అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) ఈసీ మెంబర్ హరి ప్రసాద్ అవార్డు, నగదు అందించారు.

ప్రసిడెంట్ ఉమెన్స్ జట్టు విజయం

అంతకుముందు ఉదయం సీడీసీఏ ప్రసిడెంట్ వర్సెస్ సీడీసీఏ సెక్రెటరీ లెవెల్స్ మధ్య ఉమెన్స్ ఎక్స్పోజర్ మ్యాచ్ నిర్వహించారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రసిడెంట్ ఉమెన్స్ లెవెల్స్ నిర్ణీత 18 ఓవర్లలో 168/6 పరుగులు చేసింది. బ్యాటింగ్ లో శుభశ్రీ 56, పద్మజ 43 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో విష్ణు ప్రియ నాలుగు వికెట్లు సాధించింది. 169 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సీడీసీఏ సెక్రటరీ ఉమెన్స్ లెవెల్స్ గ్రీష్మ సాయిని విజృంభించి ఆడి కేవలం 51 బంతులలో 86 పరుగులు చేసినప్పటికీ నిర్ణీత 18 ఓవర్లలో 158/4 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఆమెతోపాటు భవిత 33(29), ప్రవళిక 21(13) పరుగులు చేశారు.

నగదు బహుమతి అందుకుంటున్న ఉమెన్స్ జట్టు

బౌలింగ్‌లో వర్షిత మాత్రమే రెండు వికెట్లు తీసుకున్నారు. దీంతో సిడిసిఎ ప్రసిడెంట్ జట్టు సెక్రటరీ జట్టుపై పది పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్న శుభశ్రీకి సీడీసీఏ సెక్రటరీ రవి, మహిళా కోచ్ లు అనిత, చంద్రిక, మీనా, జ్యోతి, పెబీ మాధురి అవార్డు నగదు బహుమతి అందించారు.

గట్టు గంగమ్మ జాతరలో రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం నేషనూరు పంచాయతీ గట్టు గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్‌కెరోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌కె రోజా గంగమ్మకు విశేష పూజలు నిర్వహించారు. మండల నాయకులతో కలిసి దర్శించుకున్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజాకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మునివేలమ్మ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి జయ ప్రకాష్, టిడిపి నాయకులు మోహన్ రెడ్డి, నేషనూరు సర్పంచ్ గోవిందస్వామి రెడ్డి, ఎస్టీ సెల్ నాయకులు చిరంజీవి, మాజీ ఆలయ ఛైర్మన్ మనోహర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైసిపి సభ్యులు, స్థానికప్రజలు పాల్గొన్నారు.


మాజీ మంత్రి ఆర్‌కె రోజాను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

'మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలుకుదాం'

ప్రజాశక్తి- పుంగనూరు: మహాజన నేత మందకృష్ణ మాదిగ ఘనస్వాగతం పలుకుదామని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ బి.నరసింహులు బుధవారం తెలిపారు. మాదిగ, మాదిగల ఉపకులాల ఉజ్వల భవిష్యత్ కోసం గత 30 సంవత్సరాల నిరంతరం అలుపెరుగనిపోరాటం చేసి మాదిగల ఉనికిని, అస్థిత్వాన్ని ఆత్మగౌరవాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చిన నేత మందకృష్ణ మాదిగ అన్నారు. ఈనెల 27న భారతదేశ అత్యున్నత పౌరపురస్కారం స్వీకరించి ఈనెల 31న వరంగల్ కేంద్రానికి వస్తున్న సందర్భంగా పుంగనూరు నియోజకవర్గంలోని 6మండలాల నుండి అనుబంధ సంఘాలు కార్యకర్తలు సామాజికవాదులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలం ప్రధాన కార్యదర్శి (చిట్టి) వెంకటరమణ, అండిగానిపల్లె సుబ్రమణ్యం, మురళి, ప్రసాద్, రఘు, గోవర్ధన్ పాల్గొన్నారు.

హాకింగ్స్‌లో ఆత్మీయ సమ్మేళనం

సమావేశంలో పాల్గొన్న హఫీజ్

ప్రజాశక్తి - కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని హాకింగ్స్ పాఠశాలలో కమిటీ అధ్యక్షులు హఫీజ్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల యాజమాన్య కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బందితోపాటు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు శాంతిని కోరుకుంటూ దువ్వ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం పరిధిలో ముస్లిం కులస్తులు కలిసికట్టుగా ఉండాలని, ఎవరికి ఎలాంటి కష్టం ఏర్పడ్డ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏకమై పోరాటాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ప్రజాశక్తి -కోట: కోట మండలం వెంకన్నపాలెం పంచాయతీలో టీడీపీ నాయకులు యరగల వీరయ్య ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం టిడిపి అధ్యక్షులు ఉలస శీనయ్య, ముచ్చుకాయల పవన్ కుమార్, విన్నమాల శ్రీకాంత్, వంకా కోటేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, సెనేట్ హాల్‌లో ఎన్‌టిఆర్ జయంతిని వర్సిటీ ఉన్నతాధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ఇన్‌చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, ఆచార్య పివి నరసయ్య, డీన్ ఆచార్య ఎన్ చంద్రాయుడు, మాజీ పాలక మండలి సభ్యుడు ఆచార్య పి బాలసిద్ధముని, ఆచార్య జి ఆదినారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలం లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, తహశీల్దారు కార్యాలయంలో ఎంపీడీవో గోవర్ధన్ తహశీల్దారు శైలకుమారి మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాలరెడ్డి ఆధ్వర్యంలో బుధవారంఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో రఘురామయ్య, ఏ పీవో ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌వియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు

వాహనాల దొంగలు అరెస్ట్

- రూ.18 లక్షలు విలువైన వాహనాలు సీజ్

ప్రజాశక్తి- గుడిపాల:

ట్రాక్టర్ దొంగలను అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్సై రామ్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి తుమ్మలవారిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ నాయుడుకు చెందిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన గుడిపాల పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక పరిజ్ఞానంతో ఆ ట్రాక్టర్ చిత్తూరు మీదుగా కలికిరి వైపు వెళ్లినట్లు గుర్తించారు. ముద్దాయిలైన అవినాష్ రెడ్డి, నితీష్ కుమార్‌రెడ్డి, మరోవ్యక్తి మైనర్ బాలుడును బుధవారం చీలాపల్లి క్రాస్ రోడ్ వద్ద అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరు కలికిరి మండలం పారపట్ల గ్రామానికి చెందిన వారిని తెలిపారు. వీరిపై ఇప్పటికే మన జిల్లాలో సుమారు 15 మోటార్ సైకిల్స్ దొంగతనం కేసు, చైన్స్ స్నాచింగ్ కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వీరి ముగ్గురు కలిసి ట్రాక్టర్ మీద ఉన్న నెంబర్ ప్లేట్‌ని తీసి ఎవరికి అనుమానం రాకుండా బ్లూ కలర్ పెయింట్ వేసి తమిళనాడులో అమ్మడానికి పోతుండగా వీరిని అరెస్ట్ చేసినటు తెలిపారు. అనంతరం ముద్దాయిలను విచారించగా వివిధ ప్రాంతాల్లో దొంగతనం చేసిన రెండు రాయల్ ఎన్ఫీల్డ్, 2 బజాజ్ పల్సర్, ఒక స్పెండర్ ప్లస్, ఒక ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మోటార్ సైకిల్ విలువ 8 లక్షలు, ట్రాక్టర్ విలువ సుమారు రూ.10లక్షలు మొత్తం రూ.18 లక్షల విలువగల వాహనాలను సీజ్ చేసి వారిని రిమాండ్ పంపించడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:

కటింగ్ షాపు నడిపే వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ తెలిపారు. మండలంలోని పిళ్ళారి కుప్పం క్రాస్ రోడ్డులో కటింగ్ షాపులో పనిచేసే ఓ వ్యక్తిని చిన్న తయ్యూరు గ్రామానికి చెందిన చందు, ప్రశాంత్, ఉదయ్ ముగ్గురు మద్యం తాగి కటింగ్ షాపులో పనిచేసే వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న నగిరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆదేశాల మేరకు ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ దాడికి పాల్పడిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి, బుధవారం వారిని అరెస్టు చేసి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కి పంపారు. ఈ సందర్భంగా ఎస్సై సుమన్ మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటి అసంఘటిత కార్యక్రమాలకి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోమలలో నాకాబందీ

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- సోమల:

మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఎస్సై శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు నాకాబంది నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ ధరించాలని, రహదారి సూత్రాలు పాటించాలని, కార్లు, లారీలు, టెంపోల డ్రైవర్ల నుండి రికార్డులు పరిశీలించి వాహనాల రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పోలీసులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి- పలమనేరు:

పలమనేరులోని పలు సినిమా థియేటర్లలో అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా తినుబండారాల రేట్లు, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు. ప్రేక్షకులకు థియేటర్ యాజమాన్యాలు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పలమనేరు తహశీల్దార్ ఇన్నునాథన్ తెలిపారు.